బీచ్ వద్ద పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. బీచ్‌కు ప్రకృతి ప్రేమికులు, పర్యాటకులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాల్లో ఉదయమే బీచ్‌కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తేనెలపై, ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటలలో సహపంక్తి భోజనాలు చేసి సేద తీరారు.

సముద్ర స్నానాలు చేస్తున్న పర్యాటకులు

మహిళా ఓటర్లకు..

చీర 'ఎర'..!

ఎన్నికల్లో గెలిచేందుకు ఈసారి ముందుగానే గాలం

షెడ్యూల్ కూడా రాక ముందే తాయిలాల పంపిణీ

డ్వాక్రా మహిళలకు చీరలు అందజేత

పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో తాయిలాల జోరు

మిగిలిన నియోజకవర్గాల్లోనూ తాయిలాల వ్యూహాలకు పదును

పట్టించుకోని అధికార యంత్రాంగం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడకుండానే ఓటర్లను వలలో వేసుకునేందుకు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంఎల్ఎ అభ్యర్థులు ఇప్పటి నుంచే తాయిలాల పంపిణీకి తెరలేపారు. ముఖ్యంగా మహిళా ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ ప్రారంభించారు.

పాలకొల్లులో అధికార, ప్రతిపక్షపార్టీలు పంపిణీ చేసిన చీరలు ఇవే

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎంఎల్ఎ అభ్యర్థులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమైంది. మరో నెలరోజులకుగాని ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. ఇంకా ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, జనసేన అభ్యర్థులను అధికారికంగా ప్రకటించలేదు. ఇరుపార్టీల్లో తమకు సీటు గ్యారెంటీ అనుకున్న అభ్యర్థులు నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచారం ప్రారంభించడమే కాకుండా, తాయిలాల పంపిణీకి సైతం తెరలేపిన పరిస్థితి ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. ఇప్పటికే పాలకొల్లు, ఆచంట నియోజకవర్గాల్లో డ్వాక్రా మహిళలకు చీరల పంపిణీ పూర్తయినట్లు తెలిసింది. పాలకొల్లులో వైసిపి, టిడిపి అభ్యర్థులు ఇద్దరూ పోటాపోటీగా డ్వాక్రా మహిళాలకు చీరలు అందించినట్లు తెలుస్తోంది. ఆచంట నియోజకవర్గంలో మాత్రం వైసిపి అభ్యర్థి ఇప్పటికే చీరలు పంపిణీ పూర్తి చేసినట్లు సమాచారం. ఆసరా చెక్కుల పంపిణీ సందర్భంగా అధికార పార్టీ అభ్యర్థులు డ్వాక్రా మహిళలను సమావేశాలకు పిలిచి భోజనాలు పెట్టి, చీరలు అందజేసినట్లు చెబుతున్నారు. ఉండి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎంఎల్ఎ ప్రతి ఓటరుకూ కంచం పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎత్తులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత అధికారుల నిఘా పెరుగుతుందని, తాయిలాల పంపిణీకి ఇబ్బంది వస్తుందనే కారణంతో అధికార పార్టీ అభ్యర్థులు ముందుగానే అధికార యంత్రాంగం అండతోనే చీరల పంపిణీ సాగించేస్తున్నారు. దీంతో ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు కూడా అదేబాటలో నడుస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్న అధికార యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోంది. ఇంతకుముందు ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత, ఎన్నికలకు 48 గంటల ముందు అభ్యర్థులు తాయిలాల పంపిణీ చేపట్టేవారు. ఈసారి ముందుగానే ఓటర్లను తమవైపు తిప్పుకునేందుకు చీరల పంపిణీ చేపట్టడం చూస్తే ఈ ఎన్నికలు ఏవిధంగా జరుగుతాయోననే చర్చ నడుస్తోంది.

ఎన్నికల ముందు రోజు పరిస్థితి వేరట..!

ప్రస్తుతం చీరల పంపిణీతో సరిపెడుతున్నామని, ఎన్నికల ముందు పరిస్థితి వేరుగా ఉంటుందని ఇరు పార్టీలకు చెందిన నాయకుల్లో చర్చ నడుస్తోంది. గత ఎన్నికల్లోనూ ఓటుకు రూ.500 నుంచి రూ.రెండు వేల వరకూ పంపిణీ సాగింది. ఈసారి అంతకంటే ఎక్కువగా డబ్బు కుమ్మరించనున్నట్లు చెబుతున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లూ చేసేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల షెడ్యూల్ వస్తే పోలీసులు, అధికారుల నిఘా పెరిగిపోతుందని, అధికారులంతా ఎన్నికల కమిషన్ చెప్పినట్లు నడుచుకుంటారని అంచనా వేస్తున్నారు. ఇప్పుడైతే అధికారులు తాము చెప్పినట్లు వింటారని అధికార పార్టీ అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఎంత ఖర్చు పెట్టాలి, ఏవిధంగా పంపిణీ చేయాలనే వ్యూహాలు ఇప్పటికే సిద్ధం చేసుకుని అధికార పార్టీ నాయకులు రెడీగా ఉన్నట్లు సమాచారం. ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల జాబితాను ఇంకా ప్రకటించకపోవడంతో ముందుకు, వెనక్కి ఆలోచన చేస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో డబ్బు పెద్దఎత్తున కుమ్మరించి గెలుపు దక్కించుకోవాలని ప్రధాన పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఎంఎల్ఎ అభ్యర్థులు పంపిణీ చేస్తున్న తాయిలాలపై అధికారులు స్పందించకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందుముందు పరిస్థితి ఏవిధంగా ఉంటుందో వేచిచూడాలి.

మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్

రంగరాజుకు టిక్కెట్ ఇవ్వొద్దు..

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ - ఆచంట వైసిపిలో భగ్గుమన్న విభేధాలు

ప్రజాశక్తి - పెనుగొండ

వైసిపి ఆవిర్భావం నుంచి ఉన్న నేతలను పక్కన పెట్టి ఆచంట ఎంఎల్ఎ రంగనాథరాజు గ్రూపు రాజకీయాలు నడుపుతూ వైసిపి కార్యకర్తలపైనే కేసులు పెట్టించి ఘనత సాధించారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ ఆరోపించారు. ఆదివారం సిద్ధాంతంలోని కళ్యాణ మండపంలో ఆచంట నియోజకవర్గానికి చెందిన పలువురు ఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, నేతలు సమావేశమై రంగరాజుపై తిరుగుబావుటా ఎగురవేశారు. ఈ సందర్భంగా వైట్ల కిషోర్ మాట్లాడుతూ ఈ సమావేశం నిర్వహించాల్సి రావడం చాలా బాధాకరంగా ఉందన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రావాలని వైసిపి ఆవిర్భావం నుంచి నిర్విరామంగా పని చేశామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మళ్లీ జగన్ ప్రభుత్వం రావాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. అయితే ఆచంట వైసిపి టిక్కెట్‌ను సిట్టింగ్ ఎంఎల్ఎ చెరుకువాడ రంగనాథరాజుకు ఇవ్వొద్దని అధిష్టానాన్ని కోరుతున్నామని తెలిపారు. రంగరాజు ఎంఎల్ఎ అయిన తర్వాత గ్రూపు రాజకీయాలు ప్రోత్సహిస్తూ సొంత పార్టీ నేతలనే ఇబ్బంది పెడుతున్నారన్నారు. బిసి నేత కడలి నాగ గోవిందరాజు మాట్లాడుతూ సిద్ధాంతంలో 105 మందికి స్థలాలు ఇస్తామని చెప్పి డబ్బులు దండుకున్నారని, అర్హులకు ఇంతవరకు ఇంటి స్థలం మంజూరు చేయలేదని ఆరోపించారు. ఒకొక్కరి వద్ద రూ.20 వేలు తీసుకున్నారని, ఇదేమిటని ప్రశ్నించిన వైసిపి కార్యకర్తలపైనే తప్పుడు కేసులు పెట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పలువురు నేతలు రంగరాజుపై ఆరోపణలు చేస్తూ మాట్లాడారు.

హాజరైన వైసిపి నేతలు, కార్యకర్తలు

భారీగా ఎగసిపడుతున్న అగ్నికీలలు

రాయలంలో భారీ అగ్నిప్రమాదం

పాత ప్లాస్టిక్ స్ర్కాప్ గొడౌన్‌లో మంటలు - భయభ్రాంతులకు గురైన ప్రజలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం మండలం రాయలం గ్రామ పరిధిలో ప్లాస్టిక్ స్ర్కాప్ గొడౌన్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్దఎత్తున అగ్నికీలలు ఎగసి పడి దట్టమైన పొగ అలుముకోవడంతో చుట్టుపక్కల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. భీమవరంలోని రెండు ఫైరింజన్లతోపాటు ఆకివీడు ఫైరింజన్ కూడా రంగంలోకి దిగి మంటలు అదుపులోకి తీసుకొచ్చాయి. జిల్లా అసిస్టెంట్ ఫైరాఫీసర్ సిహెచ్.సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో సుమారు రెండు గంటలకుపైగా 20 మంది సిబ్బంది కష్టపడి మంటలను అదుపు చేశారు. చుట్టుపక్కల అపార్టుమెంట్లు ఉండటంతో వాటిలోని ప్రజలంతా ఆందోళనకు గురయ్యారు. ఈ సందర్భంగా ప్రమాదంపై ఫైరాఫీసర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ గొడౌన్ వెనుక భాగంలో చెత్తకు నిప్పంటించడంతో ఆ మంటల కారణంగా గొడౌన్‌లో సామగ్రి దగ్ధమైందన్నారు. ఈ ప్లాస్టిక్‌కు మండే గుణం ఉండడంతో ఒక్కసారిగా మంటలు, పొగ పెద్దఎత్తున ఎగసిపడ్డాయన్నారు. నష్టం అంచనా వేయాల్సి ఉందని తెలిపారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఒపిఎస్ పెట్టాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో ఒపిఎస్ అమలు అంశాన్ని పెట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి కోరారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు అధ్యక్షత వహించగా గోపీమూర్తి మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని ముఖ్యమంత్రి జగన్ హామీ ఇచ్చి అమలు మరిచారన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న సమయంలో అనేక రాష్ట్రాలు ఒపిఎస్ అమలు చేస్తున్నాయని, రాష్ట్రంలో కూడా అన్ని రాజకీయ పార్టీలు ఒపిఎస్ అమలు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. అటువంటి వారికే తమ ఓట్లు అని ఓట్ ఫర్ ఒపిఎస్ పేరుతో పోరు సాగిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగా ఓట్ ఫర్ ఒపిఎస్ పేరిట ప్రధాన రాజకీయ పార్టీల రాష్ట్ర నాయకత్వానికి ఉత్తరాలు రాశామన్నారు. రాజకీయ పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు, పార్టీల జిల్లా అధ్యక్షులకు వినతిపత్రాలు అందించామన్నారు. అభ్యర్థులను ప్రకటించాక నియోజకవర్గస్థాయిలో అభ్యర్థులతో చర్చా వేదికలు పెడతామన్నారు. ఒపిఎస్ అమలు చేసేవరకు యుటిఎఫ్ ఆధ్వర్యాన పోరాటం సాగిస్తామన్నారు. 14 ఏళ్ల పోరాటం చేసి అప్రంటీస్ విధాన రద్దు చేయించుకుంటే ఇప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అప్రంటీస్ విధానంలో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమని విమర్శించారు. రెగ్యులర్ పద్ధతుల్లో డిఎస్‌సి నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభిరామయ్య, రాష్ట్ర కౌన్సిలర్ జివి.రామానుజరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.నాగశిరోమణి, పి.కృష్ణకుమారి, పి.శివప్రసాద్, సిహెచ్.కుమార్‌బాబ్జీ, జి.రామకృష్ణంరాజు, డి.ఏసుబాబుతోపాటు జిల్లాలోని అన్ని మండల, పట్టణ శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

భీమవరంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, భీమవరం హాస్పిటల్స్ సంయుక్తంగా జిల్లా వాసులకు గుండె వైద్య సేవలు అందించడానికి ఆస్టర్ రమేష్ భీమవరం హాస్పిటల్స్ సెంటర్ ఫర్ కార్డియాక్ సైన్సెస్‌ను ప్రముఖ వైద్యులు, పాలకొల్లు మాజీ ఎంఎల్ఎ సత్యనారాయణ మూర్తి (బాబ్జి) ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ బాబ్జి మాట్లాడుతూ గుండె సంబంధిత వైద్యం అందించడంలో 35 ఏళ్లుగా ఎంతో పేరుగాంచిన రమేష్ హాస్పిటల్స్ ఈ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ గుండె జబ్బులకు అత్యవసర వైద్యం అందాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతిక్షణం ఎంతో అమూల్యమైందన్నారు. ఆలస్యం ప్రాణాంతకం కావచ్చన్నారు. చాతిలో నొప్పి వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని, వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ గుండెనొప్పికి, గ్యాస్ నొప్పి తేడా తెలుసుకుని వైద్యులను సంప్రదించాలన్నారు. భీమవరం హాస్పిటల్స్‌లో పూర్తిస్థాయి గుండె వైద్య సేవలు లభ్యమయ్యేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఇద్దరు కార్డియాలజిస్టులు, ముగ్గురు క్లినికల్ కార్డియాలజిస్టుల వైద్య బృందంతో యాంజియోగ్రామ్, స్టెంట్ యాంజియోప్లాస్టి, పేస్ మేకర్, హార్ట్ ఎటాక్ అన్ని గుండె సమస్యలకు అత్యవసర వైద్యం అందించే విధంగా ఇక్కడ ఏర్పాట్లు చేశామన్నారు. భీమవరం హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను ఒకే గొడుగు కింద అందించే ప్రయత్నంలో భాగంగా గుండె వైద్యాన్ని ఆ రంగంలో అపారమైన అనుభవం కలిగిన రమేష్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నెలకొల్పామని తెలిపారు. 24 గంటలూ నిపుణులైన వైద్యులతో, అధునాతన వైద్య పరికరాలతో సేవలందిస్తామని తెలిపారు. భీమవరం హాస్పిటల్స్ ఎక్జిక్యూటివ్ ఛైర్మన్ డాక్టర్ గోపాలరాజు మాట్లాడుతూ ఈ రెండు వైద్య సంస్థల అపారమైన అనుభవం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు, కార్డియాలజిస్టులు డాక్టర్ మహేష్, డాక్టర్ జివి.సత్యనారాయణ రాజు, రమేష్ హాస్పిటల్స్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ పావులూరి శ్రీనివాసరావు, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, బిజినెస్ డెవలప్ మెంట్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, ప్రముఖులు డాక్టర్లు పాల్గొన్నారు.



హాస్పిటల్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్ఎ సత్యనారాయణ మూర్తి (బాబ్జి)

పంట నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలి

ఎపి కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

ప్రజాశక్తి - భీమవరం

వైసిపి ప్రభుత్వం కౌలు రైతులను అన్నివిధాలా మోస గించిందని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు విమర్శించారు. నూటికి 80 శాతం కౌలు రైతులే వ్యవసాయ సాగులో ఉన్నారని, ప్రభుత్వం మాత్రం కౌలురైతులకు చేయూతను అందించడంలో ఐదేళ్ల కాలంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రాష్ట్రంలో గత సార్వా సీజన్ సమయంలో మిచౌంగ్ తుపాన్ వల్ల పంట పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారని, తక్షణం పరిహారం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భీమవరం క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఆ సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. సంఘం సీనియర్ నాయకులు బి.రామకృష్ణ ఈ సందర్భంగా జెండా ఆవిష్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడారు. తొలుత ప్రారంభ సభలో హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సార్వా సీజన్‌లో దెబ్బతిన్న పంట నష్ట పరిహారం ఇప్పటి వరకూ విడుదల చేయకపోవడం దారుణమన్నారు. తక్షణం కౌలురైతులకు పంటనష్టం, పంటల బీమా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో నలభై శాతం పైబడి రైతులకు ధాన్యం సొమ్ము ఇవ్వాలన్నారు. జగన్ తీసుకొచ్చిన కౌలురైతుల చట్టానికి సవరణ చేసి భూయజమానులతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో కౌలురైతుల ఆగ్రహానికి గురౌతారని హెచ్చరించారు. ఇటీవల మృతి చెందిన సంఘం రాష్ట్ర నాయకులు ఎ.బాలకృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.గోపాల్, పి.రంగారావు, సిహెచ్.సైదులు, బి.శ్రీనివాసరావు, ఎం.రామాంజనేయులు. వి.రాజబాబు, పి.సుధాకర్, కౌలు రైతులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

నేడు నరసాపురంలో పోలీస్ శాఖ 'స్పందన'

ప్రజాశక్తి - నరసాపురం

పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం సోమవారం నరసాపురంలో నిర్వహించనున్నారు. స్టీమర్ రోడ్డులోని నరసాపురం రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి వేజెండ్ల అజిత పాల్గొని ప్రజల నుంచి నేరుగా అర్జీలు స్వీకరిస్తారని రూరల్ కార్యాలయ అధికారులు తెలిపారు.

అరాచక పాలనను అంతమొందించండి

మాజీ మంత్రి పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

రానున్న ఎన్నికల్లో ఆచంట ఎంఎల్ఎ రంగరాజును చిత్తుగా ఓడించేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పితాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆచంట పంచాయతీ పరిధిలోని బాలంవారి పాలెంలో పితాని పాదయాత్ర నిర్వహించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచంటలో అరాచక పాలన సాగుతుందని, గ్రామపంచాయతీ నిలువునా అవినీతిమయంగా మారిందని ఆరోపించారు. బాలంవారిపాలెంలో చెరువును కక్షపూరితంగా పూడ్చివేశారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఈ ఎంఎల్ఎను గద్దె దించేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమం ప్రతిఒక్కరికి అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు గొడవర్తి శ్రీరాములు, జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైఎస్ ఎంపిపి ఎర్రగుప్పల నాగరాజు, తాళం శ్రీనివాస్ ఎంపిటిసిలు దాసిరెడ్డి పుణ్యవతి, బొక్కా సుబ్రహ్మణ్యం, జనసేన మండలాధ్యక్షులు జవ్వాది బాలాజీనాయుడు, నంబూరి విజయ్, నెక్కంటి ప్రభాకర్, పితాని లక్ష్మణ్, నిమ్మల శేఖర్, తమ్మినీడి ప్రసాద్, కేతా మీరయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరిక్‌లో తక్కువ ధరకే నాణ్యమైన మందులు

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు

ప్రజాశక్తి - ఉండి

రోజురోజుకీ మందుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, పేదలకు నాణ్యమైన మందులను తక్కువ ధరకు అందించడంలో జనరిక్ మందుల షాపులు ఎంతో కీలకమని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. ఆదివారం యండగండి కోఆపరేటివ్ రూరల్ బ్యాంక్‌లో జనరిక్ మందుల షాపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా మందులు గ్రామస్తులకు అందించి జనరిక్ మందులు వాడాలని సూచించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో ఐదు చోట్ల జనరిక్ మందుల షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు ఇప్పటికే మూడుచోట్ల ఏర్పాటు చేశామని, మరో రెండు ప్రాంతాల్లో త్వరలో ప్రారంభించనున్నట్లు చెప్పారు. సహకార సంఘాలు రైతు సంక్షేమంతోపాటు రైతు ఆరోగ్యానికి కూడా పెద్దపీట వేయాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వ సహకారంతో జనరిక్ మందుల షాపులకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. మార్కెట్లో ఎక్కువ ధరకు పలికే మందులు కూడా అతి తక్కువ ధరకే నాణ్యమైన మందులు ఇక్కడ లభ్యమవుతాయన్నారు. ప్రజలు వీటిని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటే మరింతగా విస్తరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. ప్రత్యేకంగా ఫార్మాసిస్ట్ పర్యవేక్షణలో మందుల షాపు ఉండటం వల్ల రోగులకు ఇబ్బంది లేకుండా వారి రోగానికి అవసరమైన మందులు అందించేందుకు ఆస్కారం ఏర్పడుతుందన్నారు. డిసిసిబి బ్రాంచ్ ఆధ్వర్యంలో బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎటిఎంను ఆయన ప్రారంభించారు. ఖాతాదారులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, దీనిని వినియోగించుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యదర్శి సిహెచ్.రవికుమార్ మాట్లాడుతూ గతంలో మొబైల్ ఎటిఎంగా దీన్ని వాడే వారమని, ప్రస్తుతం రైతులకు నిరంతరం అందుబాటులో ఉంచేందుకు బ్యాంకు ప్రాంగణంలో ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉణుదుర్రు గ్రామ సర్పంచి పిన్నంరాజు నాగలక్ష్మి, ఎంపిటిసి అల్లూరి మాధవి, బ్యాంకు పాలకవర్గ సభ్యులు దాట్ల కామరాజు, పైడి రామారావు, ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న పివిఎల్

ఘంటసాల గానామృతం మధురం

ప్రజాశక్తి - ఆకివీడు

ఘంటసాల గానామృతం మధురమని, అంతటి గాయకుడు మనమధ్య లేకపోవడం తీరని లోటని పలువురు కొనియాడారు. అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్థంతి సందర్భంగా ఆదివారం స్థానిక దొరగారు చెరువు గట్టునున్న ఘంటసాల విగ్రహానికి లలిత కళా సంస్థ సరిగమ సంగీత పరిషత్ అధ్యక్షులు కోటేశ్వరరావు, పలువురు పట్టణ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమవరానికి చెందిన మోహన్ ఆర్కెస్ట్రా గాయకుడు మోహన్ ఘంటసాల పాటలు ఆలపించి అందరినీ అలరించారు. అనంతరం మోహన్‌ను పరిషత్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు.

వృద్ధులకు పండ్లు అందజేస్తున్న జాన్

వృద్ధులకు పండ్లు పంపిణీ హర్షణీయం

ప్రజాశక్తి - ఆచంట

దీనుల పట్ల ప్రేమ, ఆదరణ చూపించాలని స్వచ్ఛంద సేవా సమితి వృద్ధాశ్రమ అధ్యక్షులు కోరుకొండ జాన్ అన్నారు. మండలంలో ఆచంట డైలీ మార్కెట్ వద్ద సీనియర్ సేవా నాయకుడు జాతీయ అవార్డు గ్రహీత బొడ్డు విక్టర్ బాబు నేతృత్వంలో ప్రముఖ సమాజ సేవకులు, మదర్ థెరెసా హెల్పింగ్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సాకా రాజు ఆధ్వర్యంలో మమత స్వచ్ఛంద సేవా సమితి వృద్ధాశ్రమ అధ్యక్షులు కోరుకొండ జాన్ చేతుల మీదుగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా సమాజంలో విలువలతో కూడిన సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను గుర్తించడం లేదన్నారు. రాబోయే రోజుల్లో సమాజ సేవకులను గుర్తించి సముచిత గౌరవాన్ని అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సరెళ్ళ శివాజీ పాల్గొన్నారు.

ఉపాధిని ప్రాథమిక హక్కుగా మార్చాలి

ప్రజాశక్తి - పెనుగొండ

మాట్లాడుతున్న జెఎన్‌వి గోపాలన్

భారత రాజ్యాంగంలో ఉన్న పని హక్కును ప్రాథమిక హక్కుగా మార్చాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ఆదివారం సిద్ధాంతం గ్రామంలో అంగన్వాడీ వర్కర్ల రెండో రోజు జిల్లా శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడారు. పాలక వర్గాలు శ్రామిక మహిళల ఐక్యతను విచ్ఛిన్నం చేసే దిశగా ప్రయత్నం చేస్తు న్నాయన్నారు. ఐక్య పోరాటమే లక్ష్యంగా దేశంలో సిఐటియు పని చేస్తోందన్నారు. దేశంలోని 40 కోట్ల మంది కార్మికులను ఏకం చేయడానికి సిఐటియు 1970వ సంవత్సరంలో ఏర్పడిందని తెలిపారు. దేశంలో సుమారు కోటి మంది కార్మికులు ఉన్నారని, వీరందరి మధ్య సిఐటియు ఐక్యత సాధించే దిశలో కృషి చేస్తోందన్నారు. కార్మిక వర్గాన్ని ప్రాంతం, కుల, మతాల వారీగా చీల్చుతున్న పాలకవర్గాల పట్ల అప్రమత్తంగా ఉండాలని గుర్తు చేశారు. శ్రామిక మహిళల సమస్యలు భిన్నంగా ఉంటాయన్నారు. పని ప్రాంతంలో లైంగిక వేధింపులు, లింగ వివక్ష, అసమాన వేతనాలు, ప్రసూతి సెలవులు వంటివి మహిళలను వేధిస్తున్నాయని అన్నారు. సమస్యల పరిష్కారానికి సిఐటియు పోరాటాలు చేస్తోందన్నారు. అంగన్వాడీ లీడర్ అధ్యక్షుతన జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీలక్ష్మి, కార్యదర్శి డి.కళ్యాణి, సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు, కె.పుల్లారావు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

'టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలి'

ప్రజాశక్తి - కాళ్ల

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిని గెలిపించాలని ప్రజలను ఎంఎల్‌ఎ మంతెన రామరాజు కోరారు. కోపల్లె గ్రామంలో ఇంటింటికీ టిడిపి, బాబుతో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ రామరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన నిధులను సైతం వైసిపి ప్రభుత్వం రద్దు చేయడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి - జనసేన కూటమి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, సర్పంచి బూడి నాగమణి, ఉపసర్పంచి బూడి పర్రాలు, గ్రామాధ్యక్షుడు దంతులూరి ప్రతాపరాజు, కోపల్లె మాజీ ఎంపిటిసి దంతులూరి శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న నేతలు

బిసిల హక్కుల కోసం పోరాడాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

బిసి హక్కుల కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సంఘం నాయకుడు గుబ్బల నాగరాజు అన్నారు. తాడేపల్లిగూడెంలో జాతీయ రహదారి పక్కన బిసి హక్కుల సాధనకు నిర్వహిస్తున్న బిసి బహిరంగ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో ఆ సంఘ నాయకులు ఆదివారం ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఆయా వాహనాలను నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో మామిడిశెట్టి సత్యనారాయణ, గుడాల చింతన్న, కొల్లాటి భోగరాజు, పాల రాంబాబు, గోపాలం, పంపన భగవాన్ ఉన్నారు.

శిక్షణా తరగతులు ఉపయోగకరం

ప్రజాశక్తి - ఆకివీడు

చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే ఎంతోమందికి సార్వత్రిక విద్యాపీఠం నిర్వహించే తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యాశాఖ జిల్లా సహాయ సంచాలకులు అపోస్ ఇన్‌ఛార్జి సమన్వయకర్త ఎన్.సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానికంగా అపోస్ నిర్వహిస్తున్న పలు కళాశాలలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యా వికాస్ కళాశాలలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. జిల్లాలో 41 ఇంటర్మీడియట్ స్టడీ సెంటర్లకు 19 కేంద్రాల్లో తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతిలో 25 సెంటర్లకు గాను 13 కేంద్రాల్లో నిర్వహిస్తున్నామని చెప్పారు.

అపోస్ తరగతులను పరిశీలిస్తున్న సత్యనారాయణ

ప్రమాదకరంగా ఫ్యూజ్ బాక్స్‌లు..!

ప్రజాశక్తి - ఆచంట

ఈ దృశ్యాలు పంచాయతీల నిర్లక్ష్యానికి నిలువుటద్దం పడుతున్నాయి. నిత్యం జన సంచారం ఉండే ప్రాంతాల్లో వీధిలైట్ల కోసం ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సులు ప్రమాదకరంగా మారాయి. ఆచంట మండలం అయోధ్యలంక, పుచ్చలంక, నేతులవారిపాలెం తదితర గ్రామాల్లో ఫ్యూజ్ బాక్సులు ఏర్పాటు చేయకుండా చేతికి అందినంత ఎత్తులో విద్యుత్ స్తంభానికి ఫ్యూజ్ మట్టి అలాగే వదిలేశారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల్లో ఏదైనా ప్రమాదం జరిగినా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడానికి కూడా వీలు లేకుండా ఫ్యూజ్ వైర్‌ను డైరెక్ట్

గ్రామస్తుల ఆందోళన

చేయడంతో స్థానికులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మండలంలో కొడమంచిలి, ఆచంట, కరుగోరుమిల్లి, కందరవల్లి, భీమలాపురం, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం, శేషమ్మ చెరువు, పెదమల్లం, కోడేరు, గ్రామాల్లో రహదారి పక్కన చేతికందే ఎత్తులో ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్స్ తలుపులు దెబ్బతిని నెలలు గడుస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి విద్యుత్ ఫ్యూజ్ బాక్సుల సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

చేతికందే ఎత్తులో ఉన్న ఫ్యూజ్ బాక్స్‌ను చూపుతున్న గ్రామస్తులు

16న గ్రామీణ బంద్, సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

కేంద్ర ప్రభుత్వ రైతు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 16వ తేదీన గ్రామీణ భారత సమ్మెలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామని రౌండ్ టేబుల్ సమావేశం స్పష్టం చేసింది. ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయా తరగతుల ప్రజలను కలిసి కేంద్ర ప్రభుత్వ దుష్ట విధానాలను ప్రజలకు వివరించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జుత్తిగ నరసింహమూర్తి, ఆకుల హరేరామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై దాడి చేస్తోందన్నారు. గుడి కట్టడం ద్వారా విగ్రహాలు నిలబెట్టడం ద్వారా అభివృద్ధి జరగదని, ప్రజల సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం కోసం నిధులు కేటాయించడం, ప్రణాళికలు రూపొందించడం ద్వారా మాత్రమే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. గత పదేళ్లలో విశాఖ ఉక్కు వంటి పరిశ్రమను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదని, గతం కంటే అదనంగా సాగు భూమిని పెంచేందుకు ఏ చర్యలు తీసుకోలేదని అలాంటప్పుడు అభివృద్ధి ఎలా జరుగుతుందని అన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉద్యోగులు అన్ని తరగతుల ప్రజలు కేంద్ర ప్రభుత్వ విధానాలతో విసిగిపోయారన్నారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ మణిపూర్, జమ్మూ కాశ్మీర్, ఉత్తరాఖండ్ వంటి అనేక రాష్ట్రాల్లో బిజెపి విష పరిపాలన స్పష్టంగా కనబడుతోందన్నారు. ఈ దుష్ట పరిపాలన ఇతర రాష్ట్రాలకు ముఖ్యంగా మన రాష్ట్రానికి చేరకుముందే అడ్డుకట్ట వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రాము, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.సూర్యచంద్రరావు, సిఐటియు నాయకులు కె.సత్తిబాబు, నాగరత్నం, వరలక్ష్మి, నిర్మల పాల్గొన్నారు.

15న గ్రూప్ పరీక్షల సన్నద్ధంపై అవగాహనా సదస్సు

హాజరుకానున్న ఎంఎల్‌సిలు లక్ష్మణరావు, ఐవి : యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలో ఈ నెల 15న తేదీన గ్రూప్స్, డివైఇఒ పరీక్షల సన్నద్ధతపై ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, యుటిఎఫ్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్యవక్తగా గుంటూరు, కృష్ణ జిల్లాల గ్రాడ్యుయేట్, ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ కె.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు హాజరు కానున్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం సదస్సుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం అధ్యక్షత వహించగా గోపీమూర్తి మాట్లాడారు. పరీక్షల సన్నద్ధతకు అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రూప్స్‌కు సిద్ధమయ్యే అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల ధనుష్ మాట్లాడుతూ గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయ రామరాజు, కోశాధికారి పట్టాభి రామయ్య, భవాని ప్రసాద్, కుమార్ బాబ్జి, నాగ శిరోమణి, కృష్ణ కుమారి, రామకృష్ణరాజు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

సమస్యలుంటే చెప్పండి పరిష్కరిస్తా : ముదునూరి

ప్రజాశక్తి - నరసాపురం

గ్రామాల్లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలో తీర ప్రాంతమైన వేముల దీవి ఈస్ట్ గ్రామంలో ఆదివారం ఉదయం ముదునూరి ప్రసాదరాజు పర్యటించారు. గ్రామంలోని ప్రజలతో మమేకమై పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎటువంటి సమస్యలున్నా నిర్భయంగా తన దృష్టికి తేవాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కోట్లాది నిధులు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి జగన్ ఉద్దేశమన్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో సచివాలయ భవనం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్, అంగన్వాడీ భవనంతో పాటు పలు రోడ్లు నిర్మించుకున్నామన్నారు. ఆయన వెంట రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ తిరుమాని నాగరాజు, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, గ్రామ సర్పంచి తిరుమాని శ్రీనివాస్, జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు కొల్లాబత్తుల రవికుమార్ ఉన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

పలువురికి వసుధ ఫౌండేషన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు మండలం పెనుమదం గ్రామానికి చెందిన ఎ.దేవీప్రసాద్ కిడ్నీ సమస్యతో బాధ పడుతున్నాడు. విజయవాడ హాస్పిటల్‌లో అతనికి డయాలసిస్ జరుగుతోంది. అతినికి వైద్యం నిమిత్తం వసుధ ఫౌండేషన్ సభ్యులు 10 వేల రూపాయల చెక్కును అందజేశారు. అలాగే మొగల్తూరు మండలం తూర్పు తాళ్లు గ్రామానికి చెందిన అడ్డాల వరలక్ష్మి (40) తీవ్ర అనారోగ్యంతో బాధపడుతోంది. ఆమెకు 7,000 రూపాయల చెక్కు అందజేశారు. పేరుపాలెం గ్రామానికి చెందిన సత్యభరణి లీలావతికి 7,000 రూపాయల చెక్కు అందజేశారు. ఈ చెక్కులను ఆదివారం వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి బుద్ధరాజు ఇంటి వద్ద వసుధ ఫౌండేషన్‌కి చెందిన ఎస్.రామకృష్ణ, పి.బుద్ధరాజు, చెరుకూరి సత్యనారాయణ రాజు అందజేశారు. వైద్య సహాయం పొందిన ముగ్గురు ఛైర్మన్ మంతెన వెంకట రామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

కనకరత్నమాలకు అపరాజిత షైనింగ్ స్టార్ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజెన్ నార్త్ మహిళా విభాగం అధ్యక్షురాలు భీమలాపురం గ్రామానికి చెందిన కొత్త కనకరత్నమాల వెంకటేశ్వరరావు 2003 నుంచి 2024 వరకూ అనేక పదవుల్లో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభలో చేసిన విద్య, వైద్య సాంస్కృతిక సామాజిక యోగా వృత్తి శిక్షణ కార్యక్రమాలతో పాటు వివిధ సేవలకు గాను చెన్నయ్‌లో అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డును అందుకున్నట్లు ఆదివారం ఆమె విలేకరులకు తెలిపారు. ఈ అవార్డును చెన్నయ్ త్యాగరాయ నంద ఫంక్షన్ హాల్లో నేషనల్ ఒమెన్స్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో అపరాజిత షైనింగ్ స్టార్ వామ్ అవార్డును గ్లోబల్ కన్వీనర్ టిజి.వెంకటేష్, ప్రెసిడెంట్ రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి ప్రసాద్, మాజీ ఎంఎల్‌ఎ అంబికా కష్ణ, సినీ హీరో రాజకుమార్, గ్లోబ్ వామ్ కన్వీనర్ ఎంఎన్ఆర్ గుప్తా, రాజశేఖర్ జయశ్రీ చేతుల మీదుగా తీసుకున్నట్లు ఆమె తెలిపారు.

అవార్డు అందుకుంటున్న కనకరత్నమాల

వేములదీవి ఛానెల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్క

గణపవరం మండలం వెంకయ్య వయ్యేరు కాలువలో పరిస్థితి

గుర్రపు డెక్క తొలగించండి మహాప్రభో..!

కాలువల్లో పేరుకుపోయిన తూడు, చెత్తా చెదారం - నీటి ప్రవాహానికి అటంకం, జంతు కళేబరాలతో దుర్వాసన

ప్రజాశక్తి - నరసాపురం

తీర ప్రాంతానికి వెళ్లే వేములదీవి ఛానెల్‌లో తూడు, గుర్రపు డెక్క, చెత్త నిలిచిపోయి నీటి ప్రవాహానికి అడ్డుగా మారింది. నరసాపురం నుంచి రుస్తుంబాద మీదుగా వెళ్లే పంట కాలువలో లక్ష్మణేశ్వరం వంతెన వద్ద పెద్ద ఎత్తున చెత్త నిలిచిపోయింది. దీంతో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. పట్టణం నుంచి వచ్చే డ్రెయిన్ల నీరు ఈ కాలువలోనే కలుస్తోంది. దాళ్వా పనులు పూర్తికావస్తున్నాయి, వంతుల వారీ విధానంలో నీటిని విడుదల చేశారు. అయితే కాలువలో గుర్రపు డెక్క, చెత్త ఎక్కువగా ఉండడంతో నీరు కిందకు చేరడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త తొలగించాలని కోరుతున్నారు.

గణపవరం: గణపవరం వెంకయ్య వయ్యేరులో వెలంపేట వద్ద ఉన్న కాలినడక వంతెన వద్ద పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూడు ఇరిగేషన్ అధికారులు వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. నీటి ప్రవాహానికి జంతు కలేబరాలు కొట్టుకొచ్చి వంతెన వద్ద నిలిచిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోందని, తాము ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు కూతవేటులో ఇరిగేషన్ కార్యాలయ సిబ్బంది ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. వయ్యేరులో గుర్రపు డెక్క, తూడు రేవు మెట్ల వరకూ ఉండడంతో మహిళలు దిగడానికి ఇబ్బందులు పడుతున్నారు. గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని ఇరిగేషన్ అధికారులను కోరారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం యాత్రికులతో ఆదివారం కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన భక్తి గీతాలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణరాజు పర్యవేక్షణలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

'టిడిపి విజయం ఖాయం'

ప్రజాశక్తి - మొగల్తూరు

రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం కావాలని కోరుతూ ముత్యాలపల్లిలో ఆదివారం ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజలతో మమేకం అయ్యేందుకు లోకేష్ శంకరావం కార్యక్రమం చేపట్టారన్నారు. శంఖారావం పేరుతో రాష్ట్రంలోని 120 నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని తెలిపారు. ముందుగా గ్రామ దేవత అయిన కొర్లపాటి వెంకన్నకు ప్రత్యేక పూజలు చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు కొప్పాడ రవీంద్రనాథ్ ఠాగూర్, జోగి పండు, వాతాడి ఉమా, నాగిడి రాంబాబు, అందే రామకృష్ణ, కొల్లు పెద్దిరాజు, కొల్లాటి పెంటయ్య, దొంగ శ్రీను, కొవ్వూరు నాగేశ్వరరావు, కొల్లాటి బుల్లబ్బాయి పాల్గొన్నారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరులోని ఆర్యవైశ్య సంఘం సభ్యులు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వాసవి మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం, మహిళా మండలి, వాసవి వనిత క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్న సభ్యులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు .

'అనూహ్యం' నాటిక ఆదరణ పొందాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నటీనట సంక్షేమ సమాఖ్య కళాకారుల నిర్వహణలో 'అనూహ్యం' సాంఘిక నాటిక ప్రారంభ పూజ కార్యక్రమం క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో జరిగింది. దేవస్థానం ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్ కళాకారులతో పూజ కార్యక్రమంలో పాల్గొని అభినందనలు అందించారు. ఈ నాటిక వివిధ పరిషత్‌ల్లో ప్రదర్శనలు చేసి, విజయం పొందాలని ఆకాంక్షించారు. హైదరాబాద్ నుంచి రిటైర్డ్ థియేటర్ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసర్ ప్రసాద్‌రెడ్డి ఈ నాటిక కథ, కథనం మానవ సంబంధాల విలువలను చాటి చెప్పే ఉత్తమ సందేశాత్మక నాటికగా నిలుస్తుందని విశ్లేషణ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నాటిక రెహార్సిల్ చేశారు.

నేరాలు.. ఘోరాలు..

వృద్ధుని ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండి

అనారోగ్యం కారణంగా వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వాండ్రం గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వాండ్రం గ్రామానికి చెందిన బోను సూర్యనారాయణ (75) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అరికాళ్లు, కీళ్ల నొప్పులు తట్టుకోలేక మద్యంలో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఆయన కుమార్తె బండారి శ్రీసత్య నాగలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఉండి: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలయ్యాడు. పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. శనివారం రాత్రి కోలమూరు గ్రామంలో పాములపర్రు గ్రామానికి చెందిన చానుబోయిన నాగరాజు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. నాగరాజు కాలికి, తలకు బలమైన గాయాలవ్వడంతో స్థానికులు భీమవరం ఆసుపత్రికి తరలించారు. నాగరాజు సోదరుడు దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మోటారు సైకిల్ అదుపు తప్పి..

మొగల్తూరు: రామన్నపాలెంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నరసాపురం మండలం మోడి గ్రామానికి చెందిన మల్లుల నాగరాజు (28) ముత్యాలపల్లిలోని బండి ముత్యాల అమ్మవారి ఆలయానికి వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికెళ్తుండగా రామన్నపాలెంలో వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. 108 అంబులెన్స్‌లో నరసాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మొగల్తూరు: రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకోడేరు మండలం మోగల్లు గ్రామానికి చెందిన గుత్తుల సతీష్ (22) ఆదివారం పేరుపాలెం బీచ్‌కు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా పేరుపాలెంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు దీంతో సతీష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది పాపారావు, తేజ బాబులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని సతీష్‌కు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం నర్సాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814